

అభయుడి రథోత్సవం
ఊర్కొండపేట అభయాంజనేయస్వామి రథోత్సవం కనులపండువగా జరిగింది.

వివరాలు 8లో ▸



హైవేపై ఘోర ప్రమాదం
జాతీయ రహదారిపై రెండు డీసీఎంలు ఢీకొనడంతో ఇద్దరు దుర్మరణం చెందారు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.4 /17.1

వాతావరణం
ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

13 నుంచి సదరం క్యాంపులు
జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వికలత్వ పరీక్షల నిర్వహణ కోసం ఈ నెల 13 నుంచి మార్చి 28 వరకు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సదరం క్యాంపులు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఓ యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని, ఆయా తేదీ ప్రకారం సదరం క్యాంపులకు హాజరుకావాలని కోరారు.

నేడు చలో పీయూ
మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో చలో పీయూ చేపట్టినట్లు నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీయూలోని అన్ని కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్‌గా మార్చి విద్యార్థులతో ఫీజులు వసూలు చేస్తున్నారని, హాస్టల్, సైన్స్ ల్యాబ్‌లలో పూర్తిస్థాయిలో వసతులు లేవని, విద్యార్థులకు అత్యవసరమైతే హాస్పిటల్ కూడా అందుబాటులో లేదని ఆరోపించారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి యూన్నీ పాల్గొంటారని చెప్పారు.

నేడు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం
స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రం పారిశ్రామికవాడలోని ఫోరం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఎ.రాజసింహుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల లైఫ్‌టైం గుర్తింపు కార్డు, బకాయిలు, కనీస పెన్షన్ పెంపు తదితర సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం
పాలమూరు: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో పరీక్షలు చేయడంతోపాటు అవసరమైన వారికి హైదరాబాద్‌లోని మెడివిజన్ ఆస్పత్రిలో ఆపరేషన్ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఉన్న హెల్త్ కార్డు ఉన్న ప్రతి విశ్రాంత ఉద్యోగి ఈ శిబిరం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయులకు సైన్స్ కిట్ల పంపిణీ



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని సైన్స్ మ్యూజియంలో జిల్లా విద్యాశాఖ, టెక్ మహీంద్ర, డ్రీం ఫోర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సైన్స్ కిట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు ఎక్స్‌పెరిమెంటల్ ట్రైనింగ్ ప్రోగ్రాంను అధికారులు పూర్తి చేశారు. ఇకపై కిట్ల సహాయంతో విద్యార్థులకు బోధించాల్సి ఉంటుందని డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్, శ్రీధర్, జనార్దన్, శ్రీకాంత్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కందులు @ రూ.10,159
జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కందులకు అత్యధిక ధర లభించింది. క్వింటాలు గరిష్టంగా రూ.10,159, కనిష్టంగా రూ.9,410 కేటాయించారు. ఈ సీజన్‌లో ఇంత ధర లభించడం ఇదే మొదటిసారిగా యార్డు అధికారులు తెలిపారు. అలాగే వేరుశనగ క్వింటాలు గరిష్టంగా రూ.7,271, కనిష్టంగా రూ.3,529, హంస రకానికి రూ.1,680, మొక్కజొన్న రూ.2,250, పెబ్బర్లు రూ.7,262, అనుములు రూ.9,103 చొప్పున వచ్చాయి.

నామమాత్రంగా లావాదేవీలు
దేవరకద్ర మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన టెండర్లలో కందులు క్వింటాల్‌కు రూ.10,159 ఒకే ధర నమోదైంది. సీజన్ తగ్గడం వల్ల మార్కెట్‌లో లావాదేవీలు తక్కువ మొత్తంలో సాగాయి.

■ మార్కెట్‌లో బుధవారం ఉల్లిపాయల బహిరంగ వేలం నిర్వహిస్తారు. ప్రస్తుతం ఉల్లి సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌కు పెద్ద మొత్తంలో ఉల్లి వచ్చే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం ఉల్లి ధరలు తగ్గుముఖం పట్టడంతో వ్యాపారం జోరుగా జరగవచ్చని వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు.

● సీఎం సారు.. జర చూడరూ

మినీ లిఫ్ట్‌లు మూలకేనా..?

నిరుపయోగంగా కృష్ణా, భీమా నదులపై ఎత్తిపోతల పథకాలు
- నిర్వహణ భారం, పట్టింపు లేమితో వృథా
- తుప్పపట్టిన మోటార్లు.. పూడికతో నిండిన కాల్వలు
- వర్షాధారం, బోర్ల కిందే వానాకాలం పంటల సాగు
- ఎండాకాలంలో బీళ్లుగా భూములు



ఈ ఫొటోలో ఉన్నది మక్తల్ మండలంలోని పస్పుల ఎత్తిపోతల పథకం. పంచదేవ్‌పహాడ్, పస్పుల, చిట్యాల, చిన్నగోప్లాపూర్, పారేవుల గ్రామాల్లోని 3,500 ఎకరాలకు సాగు నీరందించాలనే లక్ష్యంతో 1987లో రూ.76 లక్షలతో రెండు దశల్లో ప్రారంభించారు. కృష్ణానది పక్కన పంప్‌హౌస్‌కు ఐదు మోటార్లు, పైపంపులకు మూడు మోటార్లు అమర్చారు. కొన్నాళ్ల తర్వాత విద్యుత్ బిల్లులు, నిర్వహణ భారంతో ఐడీసీ పక్కకు తప్పుకుని రైతులకు బాధ్యతలు అప్పగించింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో మోటార్లు, విద్యుత్ వైర్లు, స్తంభాలు దొంగలపాలు కాగా.. ఈ పథకం పూర్తిగా మూతపడింది.

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: కృష్ణా, భీమా నదుల ఆధారంగా నిర్మించిన మినీ లిఫ్ట్‌లు పెద్దమొత్తంలో మూలకుపడ్డాయి. రాష్ట్రంలో కృష్ణానది అడుగుపెడుతున్న తంగిడి గ్రామం నుంచి మొదలుకుని జూరాల ప్రాజెక్టు వరకు కృష్ణా, మాగనూర్, మక్తల్, నర్వ, అమరచింత మండలాల్లోని 15 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. ఇందులో కలహల్లి (కూసుమర్తి), హిందూపూర్, గుడేబల్లూర్ ఫేజ్–1, 2, మురహర్‌దొడ్డి (ముడుమాల్) ఫేజ్–1, 2, పుంజనూరు, కురుమూర్తిరాయ, పస్పుల, ముస్లాయిపల్లి–1, 2, కొండదొడ్డి, చంద్రగఢ్, అమరచింత ఫేస్–1, 2 మినీ స్కీంలను నిర్మించాయి. వీటిలో గుడేబల్లూర్ ఫేజ్–2, కురుమూర్తిరాయ, పస్పుల, ముస్లాయిపల్లి–1, 2, కొండదొడ్డి, చంద్రగఢ్ మినీ లిఫ్ట్‌లు నిర్వహణ లోపంతో మూలకుపడ్డాయి. మరోవైపు పథకాలు కొనసాగుతున్న వాటిలో సగం మేర మాత్రమే మోటార్లు పనిచేస్తుండడంతో ఆయకట్టుకు సరిగ్గా నీరందడం లేదు. కృష్ణా, మక్తల్ మండలాల్లోని పలు మినీ లిఫ్ట్‌ల నిర్వహణ, మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని అధికారులు ప్రతిఏటా ప్రతిపాదనలు పంపుతున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో వర్షాకాలంలో మాత్రమే ఆయా ఎత్తిపోతల పరిధిలో 70 వేల ఎకరాల్లో వరి, కందుల వంటి పంటలు సాగవుతున్నాయి. అది కూడా రైతులే కృష్ణానది నుంచి కి.మీ., కొద్దీ పైపులు వేసుకుని.. మోటార్ల ద్వారా నీళ్లు తోడుకోవాల్సిన పరిస్థితి. ఇక ఎండాకాలంలో బోర్లు ఉన్న వారు మాత్రమే సాగు చేసుకుంటున్నారు. దీంతో సుమారు 55 వేల ఎకరాల్లో భూములు బీళ్లుగానే ఉంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కృష్ణా మండలం హిందుపూర్‌లో పూడుకుపోయిన సాగుకాల్వ

ఐడీసీ నుంచి రైతు కమిటీలకు..
మినీ లిఫ్ట్‌ల నిర్వహణ బాధ్యతలను మొదట్లో ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఐడీసీ) విభాగం చూసేది. విద్యుత్ బిల్లుల భారం వంటి కారణాలతో ఈ సంస్థను ఎత్తివేసి బాధ్యతలను ఆయా ఎత్తిపోతల పరిధిలోని రైతులతో కమిటీలు వేసి అప్పగించారు. ప్రతి రెండేళ్లకోసారి కమిటీలను ఎన్నుకోవాల్సి ఉండగా.. ఎవరూ పట్టించుకోలేదు. అనంతర కాలంలో తెలంగాణ ఆవిర్భవించగా.. బీఆర్‌ఎస్ (అప్పటి టీఆర్‌ఎస్) అధికారంలోకి వచ్చింది. పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉమ్మడి పాలమూరులోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్ల నుంచి నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాలకు కాల్వల ద్వారా సాగునీరు అందించనున్నట్లు వెల్లడించడంతో మినీ లిఫ్ట్‌ల మరమ్మతు అంశం మరుగునపడింది.

తుప్పపట్టి.. దొంగలపాలు
గుడేబల్లూర్–2లో మొదట మోటార్లు మరమ్మతుకు గురవగా ఎవరూ పట్టించుకోలేదు. ఆ తర్వాత పైపులు దెబ్బతినడంతోపాటు కాల్వలు పూడుకుపోయాయి. దీంతో ఈ ఎత్తిపోతల పథకం పూర్తిగా మూతపడింది. కొండదొడ్డి లిఫ్ట్ భూములు భూత్పూర్ రిజర్వాయర్‌లో మునగడంతో మరమ్మతు చేసేందుకు వీలులేదని అధికారులు చెబుతున్నారు. ఇలా అనేక ఏళ్లుగా పలు మినీ లిఫ్ట్‌లు మూలకుపడటంతో మోటార్లు తుప్పుపట్టాయి. కొన్నింటిలో మోటార్లు కాలిపోగా.. మరమ్మతులకు నోచుకోలేదు. కొన్నిచోట్ల మోటార్లు, పైపులు, కరెంట్ సామగ్రి దొంగలపాలైనట్లు తెలుస్తోంది.

సీఎం రేవంత్‌పైనే ఆశలు..
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందినవారు కాగా.. స్వయంగా ఆయన కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ ప్రాంతంపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండటంతో ఇక్కడి ప్రజలు ఆయనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. మినీ లిఫ్ట్‌ల నిర్వహణ, మోటార్లు, పైపుల మరమ్మతుతోపాటు కాల్వల పూడికతీతకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి.. పనులు చేయించాలని కోరుతున్నారు. ఆయా లిఫ్ట్‌ల పరిధిలో పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించేలా సత్వరమే చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

లిఫ్ట్ ప్రారంభమైతే..



గుడేబల్లూర్–2 మినీ ఎత్తిపోతల పథకం కింద సుమారు 1,600 ఎకరాల ఆయకట్టు ఉంది. నాకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఉండగా.. ప్రస్తుతం వానాకాలం మాత్రమే సాగు చేస్తున్నా. గుడేబల్లూర్–2 ఎత్తిపోతలకు నిధులు వెచ్చించి మోటార్లు మరమ్మతు చేసి, కాల్వలు పూడిక తీసి.. పునరుద్ధరిస్తే రెండు పంటలు పండుతాయి. వర్షంపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. కృష్ణానదికి వరద వచ్చే సరిపోతుంది. ఈ ప్రాంత ప్రజలకు అన్ని రకాలుగా మేలు జరుగుతుంది. – రవి, హిందుపూర్, కృష్ణా

నర్సాపూర్ ఉపాధ్యాయుడి తీరుపై విచారణ
- పాఠశాలకు కొత్తగా మరో టీచర్‌ను నియమించిన అధికారులు



ప్రైవేట్ టీచర్‌తో వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ జయశ్రీ, కాంప్లెక్స్ హెచ్‌ఎం కృష్ణయ్య

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్ రూరల్ మండలం నర్సాపూర్ పాఠశాల ఉపాధ్యాయుడు పనితీరుపై విద్యా శాఖ అధికారులు విచారణ చేపట్టారు. సదరు ఉపాధ్యాయుడు విధులకు సరిగ్గా హాజరుకావడం లేదంటూ మంగళవారం 'సాక్షి'లో 'సారు రూటే.. సపరేటు' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు పాఠశాలలో మంగళవారం రూరల్ ఎంఈఓ జయశ్రీ, ధర్మాపూర్ కాంప్లెక్సు హెచ్‌ఎం కృష్ణయ్య ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. అధికారులు పాఠశాలకు చేరుకునే సమయానికే సదరు ఉపాధ్యాయుడు నియమించిన ప్రైవేట్ టీచర్ తరగతులు బోధిస్తూ కనిపించింది. దీంతో అధికారులు పలు అంశాలపై ఆమెను ప్రశ్నించారు. ఎవరు నియమించారు.. వేతనం ఎలా ఇస్తున్నారు.. ఎన్ని నెలలుగా పనిచేస్తున్నారు అనే అంశాలపై ఆమె నుంచి రాత పూర్వకంగా తీసుకున్నారు. ఇకపై పాఠశాలకు రావొద్దని సూచించారు. అలాగే ధర్మాపూర్ ఉన్నత పాఠశాల నుంచి ఓ ఉపాధ్యాయురాలిని డిప్యుటేషన్‌పై నియమించారు. ఇదిలా ఉండగా.. సదరు ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు విద్యాశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నా ఫోన్ ద్వారా స్పందించడం లేదని ఎంఈఓ జయశ్రీ తెలిపారు. సీఆర్పీ ద్వారా నోటీసులను ఉపాధ్యాయుడికి అందించేలా తీసుకుంటామన్నారు. విచారణకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను డీఈఓ రవీందర్‌కు అందజేస్తామన్నారు.

సాక్షి ఎఫెక్ట్..



సారు రూటే.. సపరేటు!

'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనం

సమన్వయంతో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలి
- సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 10 నుంచి ప్రారంభం కానుండటంతో మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గతేడాది రథోత్సవం సందర్భంగా ఇబ్బందులు ఎదురయ్యాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఆయన బందోబస్తు పెంచాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఐ ఆదిరెడ్డికి సూచించారు. అలాగే జాతరకు వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్, బండ్లు నిలబెట్టేందుకు అనువైన చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణాల ఏర్పాటుతో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని, జాతర సమయంలో విద్యుత్ అంతరాయం కలిగించొద్దని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఉచిత బస్సు ప్రయాణం ఉన్నందున మహిళలు అధికంగా వచ్చే అవకాశం ఉందని అందుకు తగినట్లుగా బస్సులు నడిపించాలని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు సూచించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా రథసప్తమి, శకటోత్సవం రోజున పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, జాతరకు వచ్చే వీఐపీలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని కోరారు. సమావేశంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి దీప్తి, తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్, ఎంపీఓ జగదీశ్, ఏఈ కిరణ్, హెల్త్ సూపర్‌వైజర్ చక్రపాణి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ ఆదేశాలతో పోలీసులు, ఇతర అధికారులు గంగాపురం ఆలయాన్ని సందర్శించి ఉత్సవాల ఏర్పాట్లపై చర్చించారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

అన్ని సౌకర్యాలు కల్పించాలి
మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వలస వచ్చి ఇటుక బట్టీల్లో కార్మికులుగా పనిచేస్తున్న వారికి భద్రతతోపాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలతోపాటు వారు నివసించే చోట తాగునీరు, మూత్రశాలలు వంటి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత యజమానులపై ఉందన్నారు. కార్మికులందరు బ్యాంకు ఖాతాలు కలిగి ఉండాలని, విద్య, వైద్యం, ఆరోగ్యం, సమయానికి వేతనాల చెల్లింపు, పనిచేసే చోట భద్రత కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవద్దని సూచించారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ యాదయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు చంద్రశేఖర్, షాహీర్ పాల్గొన్నారు.




హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్వహించిన సమావేశంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఎస్.రాజేందర్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, అంజయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మొండిచేయి
- పీయూ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఆమోదం పొందని వేతనాల పెంపు
- 2016లో ఏటా 12 శాతం పెంపునకు ప్రత్యేక ఆర్డర్
- 2021 నుంచి నిలిపివేసిన ప్రస్తుత వీసీ
- కనీసం చర్చించకపోవడంతో సిబ్బందిలో తీవ్ర నిరాశ
- వచ్చే నెలలో స్నాతకోత్సవం, న్యాక్ తనిఖీల కోసం నిధుల కేటాయింపు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో పనిచేసే నాన్ టీచింగ్ సిబ్బంది వేతనం పెంపుదలకు ఈసారి కూడా మొండిచేయి చూపారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ సమావేశంలో యూనివర్సిటీ అభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. ఈ క్రమంలోనే రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాల పెంపునకు ఆమోదం లభిస్తుందని అందరూ భావించారు. కానీ, ఆ దిశగా ఎలాంటి చర్చ జరగకపోవడంతో సిబ్బంది తీవ్ర నిరాశకు గురవుతున్నారు. నాన్ టీచింగ్ సిబ్బంది గత కొన్నేళ్లుగా తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తుండగా.. అటెండర్ నుంచి జూనియర్ అసిస్టెంట్ వరకు కేవలం రూ.7–9 వేల మధ్యే వేతనాలు ఉన్నాయి. 2016లో అధికారులు వేతనాల పెంపునకు ఆర్డర్ కాపీ విడుదల చేసి, ప్రతిఏటా 12 శాతం పెంచే విధంగా చర్యలు తీసుకున్నారు. కానీ, వీసీగా లక్ష్మీకాంత్ రాథోడ్ బాధ్యతలు స్వీకరించాక దాన్ని నిలిపివేశారు.

కమిటీ నివేదిక ఆధారంగా..
నాన్‌టీచింగ్ సిబ్బందికి వేతనాలు చాలా తక్కువగా ఉండడంతో 2016లో అప్పటి వైస్ చాన్స్‌లర్, రిజిస్ట్రార్ ప్రభుత్వంతో చర్చించి, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల సలహా మేరకు వీరికి వేతనాలు పెంచేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసి దాని ఆధారంగా 2016 చివరలోనే వేతనాల పెంపునకు సంబంధించి ఆర్డర్ విడుదల చేశారు. దీనికి 2020లో వీసీగా ఉన్న రాహుల్‌బొజ్జ సైతం అనుమతి ఇచ్చారు. కానీ, ఆ తర్వాత 2021లో బాధ్యతలు స్వీకరించిన వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ ఆర్డర్‌ను పూర్తిగా పక్కకు పెట్టి వేతనాల పెంపును నిలిపివేశారు. దీనిని ఎందుకు నిలిపివేశారన్న ప్రశ్నకు అధికారులు కేవలం 30 శాతం పీఆర్సీ ఇవ్వాలని కోరడమే కారణమని అధికారులు చెబుతున్నారు. సమస్యలపై ప్రశ్నించిన వారిని యూనివర్సిటీ అధికారులు వేధిస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ క్రమంలోనే సోమవారం పీయూ నాన్ టీచింగ్ సిబ్బంది తమ వేతనాల పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు.



PALAMURU UNIVERSITY, MAHABUBNAGAR – 509001

2016లో 12 శాతం వేతనాల పెంపునకు సంబంధించి ఇచ్చిన ఆర్డర్ కాపీ

కౌన్సిల్ ఆమోదం..
వచ్చే నెల చివరలో పీయూ స్నాతకోత్సవం నిర్వహించేందుకు పీయూ ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదించినట్లు అధికారులు చెప్పారు. ఈ మేరకు స్నాతకోత్సవానికి గవర్నర్ తమిళిసైని అధికారులు ఆహ్వానించనున్నారు. ఆమె సమయం ఇచ్చిన వెంటనే తేదీని ప్రకటించనున్నారు. ఈసారి వివిధ కోర్సుల్లో ప్రతిభచాటిన కనీసం 75 మంది విద్యార్థులకు మెడల్స్ ప్రదానం చేసే అవకాశం ఉంది. అలాగే ఇటీవల నూతన రిజిస్ట్రార్‌గా పిండి పవన్‌కుమార్‌ను నియమించగా.. ఈసీ ఆమోదించింది. ఏప్రిల్‌లో న్యాక్ తనిఖీలు జరగనున్న క్రమంలో పీయూలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

ఈసీ అనుమతించలేదు..
నాన్‌టీచింగ్ సిబ్బంది వేతనాల పెంపు కోసం ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ సమావేశం ఎజెండాలో పెట్టినా కానీ ఈసీ అనుమతించలేదు. సిబ్బంది కోసం ప్రత్యేకంగా ఒక జీఓ ఇచ్చేందుకు విద్యాశాఖ కార్యదర్శి చర్యలు తీసుకుంటామన్నారు. పీయూలో వచ్చేనెల స్నాతకోత్సవం నిర్వహించేందుకు ఈసీ అనుమతి ఇచ్చింది. ఈ సంవత్సరం న్యాక్‌కు వెళ్లనున్న నేపథ్యంలో అందుకు సంబంధించి నిధులు కేటాయించింది.
– లక్ష్మీకాంత్ రాథోడ్, పీయూ వీసీ

చొరవ తీసుకోవాలి..



గతంలో అధికారులు నాన్ టీచింగ్ సిబ్బంది ఇబ్బందులను గుర్తించి వేతనాన్ని పెంచేందుకు ప్రత్యేక ఆర్డర్ ఇచ్చారు. 2016లో ఇచ్చిన ఆర్డర్‌ను ఆధారంగా చేసుకుని 2020 సంవత్సరంలో కూడా 12 శాతం వేతనం పెంచి ఆ తర్వాత నిలిపివేశారు. ఇప్పటికైన 12 శాతం వేతనాలు పెంచాలి. పెరుగుతున్న ధరలతో పోల్చితే వేతనం తక్కువగా ఉండటం వల్ల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
– రామ్మోహన్, నాన్‌టీచింగ్ సంఘం అధ్యక్షుడు, పీయూ

ఇబ్బందులు పడుతున్నారు..



నాన్‌టీచింగ్ సిబ్బంది చాలా తక్కువ వేతనాలు ఉండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఉన్న 12 శాతాన్ని పెంచే విధంగా వీసీ పెద్ద మనస్సుతో చొరవ తీసుకోవాలి. ధరలు విపరీతంగా పెరుగుతుండటం వల్ల అరకొర వేతనాలు సరిపోవడం లేదు. ప్రతి సంవత్సరం 12 శాతం పెంచితే సిబ్బందికి ఆర్థికంగా ఒత్తిడి తగ్గుతుంది. – నారాయణరెడ్డి, జూనియర్ అసిస్టెంట్, పీయూ

క్లుప్తంగా

వేధింపులు తాళలేక.. వివాహిత బలవన్మరణం


పర్వీనాబేగం (ఫైల్)

మక్తల్: అత్తారింటి వేధింపులు తాళలేక వివాహిత బలవన్మరణానికి పాల్పడిన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. ఊట్కూర్‌కు చెందిన జుబేదాబేగం కూతురు పర్వీనాసుల్తాన (22)ను నర్వ మండలం పాతర్‌చేడ్ చెందిన కలీంపాషకు ఇచ్చి ఏడాదిన్నర క్రితం పెళ్లి చేశారు. కాగా పట్టణంలోని రహెమానియా కాలనీలో భార్యాభర్తలు కలిసి జీవనం ఉండేవారు. కలీంపాష నర్వలో టైలర్ పని చేస్తుండడంతో వారానికి ఒక సారి మక్తల్‌కు వచ్చి వెళ్లేవాడని కుటుంబసభ్యులు తెలిపారు. అయితే భార్యాభర్తల మధ్య బేదాభిప్రాయాలు రావడంతో గొడవలు పడుతుండడంతో పర్వీనా బేగం తల్లి జుబేదాబేగం, తమ్ముళ్లు కలిసి వారిద్దరికి నచ్చజెప్పారు. కాగా భర్తతో పాటు ఆయన కుటుంబ సభ్యులు వేధింపులకు పాల్పడేవారని తెలిపారు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే ఉరేసుకుని పర్వీనాబేగం ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం ఊట్కూర్‌లో ఉన్న తల్లికి సమాచారం అందించారు. మృతురాలి కుటంబ సభ్యులు మక్తల్‌కు చేరుకున్నారు. నా కూతురు ఆత్మహత్య చేసుకోలేదని, భర్తే హత్య చేసుంటాడని తల్లి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి..

జడ్చర్ల: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో మంగళవారం రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాదేపల్లికి చెందిన యూసూఫ్(45) ఆలూరు రోడ్డులోని కాలనీలో నివాసం ఉంటున్నాడు. తమ ఇంటికి దగ్గరలోనే రైలు పట్టాలపైకి వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతి

జడ్చర్ల–గొల్లపల్లి రైల్వే స్టేషన్ల మార్గంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి(40) రైలు కింద పడి మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడు రైళ్లలో బిక్షాటన చేసుకునే వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి ఒక చేయి లేదని తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

రాజాపూర్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలోని నందిగామలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చెన్నయ్య (42) ట్రాక్టర్, డీసీఎం నడుపుతూ పనిచేస్తు జీవనం సాగిస్తుండేవాడు. కొన్ని నెలలుగా మద్యానికి బానిసై ట్రాక్టర్, డీసీఎంకు కిస్తులు చెల్లించేందుకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాడు. సోమవారం రాత్రి జడ్చర్లలో ఉన్న భార్య సుజాతకు ఫోన్ చేసి చనిపోతున్నానని తెలిపాడు. భార్య వారికి ఇంటికి రావాలని కోరింది. అయితే నందిగామలో రాత్రి ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో మంగళవారం ఇంటి పక్కలవారు గమనించి మృతుడి భార్యకు సమాచారం ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాలీ ఆటో బోల్తా



భూత్పూర్: పట్టణంలోని సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ట్రాలీ ఆటోను ఢీకొంది. గద్వాల జిల్లా కేంద్రానికి చెందిన రైతులు రమేష్, బీచుపల్లి, నాగసుందర్, నరేష్, దేవరాజు సోమవారం గద్వాల నుంచి ట్రాలీ ఆటో తీసుకుని హైదరాబాద్‌కు వెళ్లారు. హైదరాబాద్‌లోని వివిధ కంపెనీలకు చెందిన రసాయనిక ఎరువులు రూ.50 లక్షల విలువ గలవి తీసుకుని సోమవారం రాత్రి బయలుదేరి వస్తుండగా భూత్పూర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. దీంతో ట్రాలీ ఆటో బోల్తాపడగా అందులో ఉన్న రైతులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఆటోలో ఉన్న క్రిమి సంహారక మందుల డబ్బాలు పూర్తిగా ధ్వంసమైనట్లు రైతులు తెలిపారు. దాదాపు రూ.30 లక్షల విలువ గల క్రిమిసంహారక మందులు నేలపాలైనట్లు వారు పేర్కొన్నారు.

వైభవం.. అభయుడి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

- భక్తజన సంద్రంగా మారిన ఆలయ ఆవరణ
- దర్శించుకున్న కల్వకుర్తి, జడ్చర్ల ఎమ్మెల్యేలు

ఊర్కొండ: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి రథోత్సవం మంగళవారం తెల్లవారుజామున కనులపండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి రథాన్ని లాగేందుకు ఆసక్తి చూపారు. ముందుగా అర్చకులు ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించి అందంగా అలంకరించిన రథంపై ఉంచారు. అనంతరం రథానికి పూజలు చేశాక ముందుకు లాగారు. భక్తుల హనుమద్‌నామ స్మరణతో ఆలయ ఆవరణ మార్మోగింది. ఉత్సవాల సందర్భంగా స్వామివారికి మన్యసూక్తులతో అష్టోత్తర నామావళి, మంగళహారతి, మంత్రపుష్పం, రాత్రి పల్లకీసేవ, హరికథ కాలక్షేపం నిర్వహించారు. అంతకుముందు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆలయంలో పూజలు చేసి స్వామివారి పల్లకీ మోశారు. రథోత్సవంలోనూ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు చింతల మనోహర్‌రెడ్డి, నర్సిరెడ్డి, రమేష్ నాయక్, చుక్కాపురం అంజయ్యగౌడ్, మ్యాకల సువర్ణ, మొండేళ్ల అశోక్, పి.గోపాల్, వట్టం వెంకటయ్య, పోలె లక్ష్మమ్మ, గుండ్లపల్లి అలివేల, కొమ్మగోని సంగప్పగౌడ్, కప్పెర చంద్రయ్య, గుండమోని మల్లేష్, దత్తాత్రేయశర్మ, ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, ఎస్‌ఐ లెనిన్, అర్చకులు శ్రీనుశర్మ, ప్రవీణ్, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు


స్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ప్రముఖుల హాజరు..

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ మంగళవారం స్వామివారిని దర్శించుకున్నారు. వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వారితో ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. వారివెంట కల్వకుర్తి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, మాజీ సర్పంచులు ధ్యాప నిఖిల్‌రెడ్డి, మ్యాకల శ్రీనివాసులు, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సంతు యాదవ్, పడకంటి వెంకటేష్, చంద్రకాంత్ తదితరులు ఉన్నారు.

హైవేపై రెండు డీసీఎంలు ఢీ


ప్రమాదంలో దెబ్బతిన్న కూరగాయల డీసీఎం


డీసీఎంలో ప్లాసిక్ ట్రేలను ఎత్తుకెళ్తున్న స్థానికులు

- డివైడర్‌ను ఢీకొనడంతో అదుపు తప్పి బోల్తా
- డ్రైవర్, క్లీనర్ దుర్మరణం
- రోడ్డుపై పడిన చేపలు, ట్రేలను ఎత్తుకెళ్లిన స్థానికులు

అడ్డాకుల: జాతీయ రహదారిపై అడ్డాకుల శివారులో అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డీసీఎం డ్రైవర్, మరో డీసీఎం క్లీనర్ దుర్మరణం చెందారు. చేపల లోడుతో వెళ్తున్న డీసీఎం ప్రమాదానికి గురవడంతో రోడ్డుపై పడిన చేపలను, కూరగాయల డీసీఎంలో ఉన్న ప్లాస్టిక్ ట్రేలను ఎత్తుకెళ్లారు. అడ్డాకుల ఎస్‌ఐ ఎం.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం రసూల్‌పల్లికి చెందిన డీసీఎం డ్రైవర్ ఎం.సుధాకర్ కూరగాయాల కోసం డీసీఎంలో ప్లాస్టిక్ ట్రేలతో హైదరాబాద్ నుంచి బెంగళూర్‌కు వెళ్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో అడ్డాకుల సమీపంలోని స్నేహ చికెన్ పరిశ్రమ వద్ద డీసీఎం డివైడర్‌ను ఢీకొని హైదరాబాద్ వెళ్లే రోడ్డుపైకి దూసుకెళ్లింది. బెంగళూర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న మరో డీసీఎంను ఎదురుగా వెళ్లి ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ఘటనలో సుధాకర్ (41) తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. చేపల లోడు డీసీఎం క్యాబిన్‌లో ఉన్న క్లీనర్ ముక్దూంపాష(24) కిందకు దూకేందుకు ప్రయత్నిస్తూ అందులోనే ఇరుక్కుపోయాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బంది క్షతగాత్రుడిని అతికష్టం మీద అరగంటకు పైగా శ్రమించి బయటకు తీశారు. వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స చేసేలోపే ప్రాణాలు వదిలాడు. ముక్దూంపాష స్వస్థలం బెంగళూర్‌గా తెలిసింది. చేపల డీసీఎం డ్రైవర్ ప్రమాదం జరుగుతుండగా కిందికి దూకి ప్రాణాలతో బయటపడినట్లు సమాచారం.

చెల్లాచెదురైన చేపలు

కూరగాయల డీసీఎం పక్క రోడ్డుపైకి దూసుకొచ్చి చేపల లోడుతో వెళ్తున్న డీసీఎంను ఢీకొట్టడంతో డీసీఎంలో ఉన్న చేపల ట్రేలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. తెల్లవారుజామున స్థానికులు ప్రమాద స్థలానికి వెళ్లి చేపలను ఎత్తుకెళ్లారు. అదేవిధంగా బోల్తాపడిన కూరగాయల డీసీఎంలో ఉన్న ప్లాస్టిక్ ట్రేలను సైతం ఎత్తుకెళ్లారు. పోలీసులు స్థానికులను చెదరగొట్టారు. ఇదిలా ఉండగా ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు మృతదేహాలను జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలుశిక్ష

అలంపూర్ రూరల్: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తులను అలంపూర్ కోర్టులో మంగళవారం హాజర పరుచగా, జడ్జి ఐదుగురికి రూ.2వేలు చొప్పున జరిమానా విధించి జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. కర్నూల్ జిల్లాకు చెందిన షేక్ ఇబాల్‌కు రూ.2 వేలు జరిమానా, రెండు రోజులు జైలు, కుర్వ బాలకృష్ణకు రూ.2 వేల జరిమానా, మూడు రోజులు జైలు, కుర్వ మద్దిలేటికి రూ. 2వేల జరిమానా, నాలుగు రోజులు జైలు, కావేటి చంద్రునికి రూ.2వేల జరిమానా, ఏడు రోజులు జైలు, అలంపూర్ మండలం కోనేరుకు చెందిన బోయ నాగరాజుకు రూ.2వేల జరిమానా, మూడు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారిని మహబూబ్‌నగర్ జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, మైనర్ బాలురకు వాహనాలు ఇవ్వరాదని ఎస్‌ఐ సూచించారు.

గృహహింస కేసులో..

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన దయ్యపు శివ భార్యను హింసించడంపై కేసు నమోదు కాగా మంగళవారం వనపర్తి అసిస్టెంట్ సెషన్‌కోర్టు జడ్జి శివకు ఆరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ రవిప్రకాష్ తెలిపారు. 2019లో మండల కేంద్రానికి చెందిన శివమ్మకు వివాహం చేసుకున్నాడని, ఆ తర్వాత ఆమెను గృహహింసలకు గురిచేయడంతో మృతి చెందిందని, ఈ విషయమై కోర్టు పూర్తి స్థాయిలో విచారణ చేసి శిక్షను ఖరారు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత

మద్దూరు: ఆభరణాలు, ఇతర వస్తువులు ఉన్న బ్యాగు పోగొట్టుకున్న మహిళకు తిరిగి అప్పగించిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్యాంసుందర్ తెలిపిన వివరాల ప్రకారం కోస్గికి చెందిన షాహిన్‌బేగం భర్త ఇబ్రహీంతో కలిసి తన పుట్టింట్లో శుభకార్యం సందర్భంగా దామరగిద్ద మండలంలోని గడిముక్కన్‌పల్లికి ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో నగలను ఒక బ్యాగులో వేసి చేతిలో పట్టుకుంది. దోరేపల్లి వద్ద బ్యాగు జారిపోవడంతో అక్కడే ఉన్న గ్రామస్తులు చోటుమియా, సుతరి శివరాజ్ తీసుకొని పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. బ్యాగులో 8 తులాల బంగారు ఆభరణాలు, రూ.500 నగదు, ఆధార్‌కార్డు ఉండడంతో ఆధార్ ఆధారంగా వారిని గుర్తించి బ్యాగును అప్పగించారు. నిజాయితీగా బ్యాగు అప్పగించిన వారిని పోలీసులు అభినందించారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: వ్యక్తి మృతి

కోస్గి: రోడ్డు మలుపు వద్ద లారీ బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గుండుమాల్ మండలంలోని మంగళవారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు గుండుమాల్ మండలంలోని భక్తిమళ్ల శివారులో ఓ ఇటుక బట్టీలో పని చేయడానికి నల్లగొండ జిల్లా దిండి మండలం జైత్యాతండాకు చెందిన బద్యానాయక్ తన భార్య, పిల్లలతో వచ్చి జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం బట్టీలో పనిలేకపోవడంతో భక్తిమళ్లకు చెందిన అంజిలయ్యతో కలిసి బైక్‌పై గుండుమాల్ మండల కేంద్రానికి వెళ్లాడు. పనులు ముగించుకొని వస్తున్న క్రమంలో కోస్గి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ బియ్యంతో వెళ్తున్న లారీ రోడ్డు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బద్యానాయక్(48) తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి అంజిలయ్యకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అంజిలయ్యను పాలమూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. బద్యానాయక్ మృతదేహాన్ని కోస్గి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితులపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయం రూ.16 లక్షలు

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటంలో వెలిసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి హుండీ ఆదాయం రూ.16.64 లక్షల వచ్చినట్లు ఈఓ రంగారావు తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో ఆలయ ఫౌండర్ చైర్మన్ ఆదిత్య లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు, మరియు జాతరలో భక్తులు సమర్పించిన కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. 3 కిలోల 990 గ్రాము వెండి కూడా స్వామి వారికి భక్తులు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో ఆయన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆలయ హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

మన్నె చేరికతో కాంగ్రెస్‌లో జోష్

- జడ్చర్ల సెగ్మెంట్‌లో మరింత బలపడిన హస్తం పార్టీ
- ఎంపీగా పోటీచేస్తారన్న ఊహాగానాలు


కాంగ్రెస్ పార్టీలో చేరిన మన్నె జీవన్‌రెడ్డి

జడ్చర్ల/ నవాబ్‌పేట: బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న జడ్చర్ల నియోజకవర్గంలో మరో షాక్ తగిలింది. ఇప్పటికే ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలుపొందగా.. తాజాగా బీఆర్ఎస్ ముఖ్యనేత మన్నె జీవన్‌రెడ్డి హస్తం గూటికి చేరారు. నవాబ్‌పేట మండలం గురుకుంటకు చెందిన పారిశ్రామికవేత్త మన్నె జీవన్‌రెడ్డి మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన చేరికతో నియోజకవర్గంలో కాంగ్రెస్ బలం మరింత రెట్టింపు అయ్యింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున జడ్చర్ల అభ్యర్థిగా జీవన్‌రెడ్డి పోటీ చేస్తారన్న ప్రచారం సాగింది. అయితే బీఆర్ఎస్ టికెట్ దక్కకపోవడంతో ఆయన పార్టీకి, ప్రచారానికి దూరంగా ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్‌లో చేరిన జీవన్‌రెడ్డి.. ఎంపీగా పోటీచేస్తారన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదే నిజమైతే సొంత బాబాయ్ అయిన స్థానిక ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో జీవన్‌రెడ్డి తలపడే పరిస్థితి ఉంటుంది. ఒకే ఇంటి నుంచి ఒకరు బీఆర్ఎస్, మరొకరు కాంగ్రెస్ అభ్యర్థులుగా రంగంలోకి దిగితే ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుంది. అభ్యర్థుల ఖరారు తర్వాత జిల్లాలో రాజకీయ సమీకరణలు మారే అవకాశాలు ఉన్నాయి.

సెగ్మెంట్‌లో ప్రత్యేక గుర్తింపు..

మన్నె జీవన్‌రెడ్డికి ఎంఎస్ఎన్ ఫార్మ పరిశ్రమ అధినేతగా, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడిగా ప్రత్యేక గుర్తింపు ఉంది. రాజకీయాలకతీతంగా సేవా కార్యక్రమాల్లో ఆయన ముందుంటున్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్యపరంగా అనేక కుటుంబాలకు ఆపన్నహస్తం అందించారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడంపై మన్నె జీవన్‌రెడ్డి వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గులాబీ దళంలో గుబులు..

కాంగ్రెస్ పార్టీలో మన్నె జీవన్‌రెడ్డి చేరికతో గులాబీ దళంలో గుబులు మొదలైంది. ఆయన వెంట వెళ్లేవారెవరన్న దానిపై సర్వత్రా చర్చసాగుతోంది. నవాబ్‌పేట మండలంలో జీవన్‌రెడ్డికి ప్రత్యేక క్యాడర్ ఉంది. వారంతా కాంగ్రెస్‌లోకి వెళ్లడం ఖాయమని తెలుస్తోంది. ఇప్పటికే ఆయన వెంట ముగ్గురు మాజీ సర్పంచ్‌లు, ఒక ఎంపీటీసీ ఢిల్లీకి వెళ్లారు. జిల్లాకేంద్రంలో నిర్వహించే సభలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద మొత్తంలో చేరనున్నట్లు తెలుస్తోంది. కాగా.. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ నాయకులు ఎదుర్కొని మెజార్టీ సాధించారు. ఈ క్రమంలో ఆ పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. కొందరి చేరికపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.

మన్ననూరులో బీహార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు


బిహార్ ఎమ్మెల్యేలతో ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ

మన్ననూర్: బీహార్‌కు చెందిన 17 మంది కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్తూ మార్గమధ్యంలో మన్ననూరులో కాసేపు ఆగారు. వారికి ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ స్థానిక అటవీశాఖ వనమాళికా ప్రాంగణంలో విందు ఏర్పాటు చేశారు. అక్కడే కాసేపు విశ్రాంతి తీసుకున్న అనంతరం నల్లమల లోతట్టు ప్రాంతంలోని వ్యూ పాయింట్‌కు చేరుకొని ప్రకృతి అందాలను తిలకించారు. అక్కడి నుంచి సాయంత్రం శ్రీశైలం బయలుదేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ అమ్రాబాద్ నాయకులు హరినారాయణ, బుచ్చయ్య, ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు రహీం, వెంకటేశ్వర్లు, రేణయ్య, సత్యనారాయణ, రాజారాం, బాలస్వామి, సురేష్, జాకీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ప్రథమ చికిత్స..

వనమాళికా ప్రాంగణంలో బిహార్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తివారీ చేతికి గాయం కాగా అక్కడే ఉన్న ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ ప్రథమ చికిత్స చేశారు.

పీయూలో క్యాంపస్ సెలక్షన్స్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ చేపట్టారు. ఈ మేరకు వివిధ సబ్జెక్టుల వారిగా మొత్తం 93 మంది అభ్యర్థులు రాత పరీక్షలో పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ మాట్లాడుతూ అభ్యర్థులు కమ్యూనికేషన్ స్కిల్‌పై దృష్టి సారిస్తే తదుపరి ఇంటర్వ్యూను సులభంగా దాటవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పీయూ ప్లేస్‌మెంట్ అధికారి అర్జున్‌కుమార్, యాదయ్య, ఎస్ఎం పాషా, వెంకటేష్, మక్సూద్ పాల్గొన్నారు.

మూసాపేట వైన్‌షాపులో చోరీ

- షట్టర్ విరగొట్టి మద్యం ఎత్తుకెళ్లిన దొంగలు
- సీసీ కెమెరాలు ధ్వంసం, డీవీఆర్ బాక్స్ చోరీ
- రూ.5.20లక్షల నష్టం


వైన్‌షాపులో ఆధారాలను సేకరిస్తున్న క్లూస్‌టీం

అడ్డాకుల: మూసాపేట సమీపంలోని వైన్‌షాపులో చోరీ జరిగింది. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి మద్యం ఎత్తుకెళ్లారు. అదేవిధంగా సీసీ ఫుటేజీ నిక్షిప్తమయ్యే డీవీఆర్ బాక్స్‌ను సైతం దొంగలు పట్టుకెళ్లారు. ఈ ఘటన సోమవారం అర్ధరాత్రి జరిగింది. మూసాపేట ఎస్‌ఐ సుజాత తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట వైన్‌షాపును సంకలమద్ది శివారులో వేముల రోడ్డు పక్కన ఏర్పాటు చేశారు. ఎప్పటిలాగే రాత్రి వైన్‌షాపును మూసి నిర్వాహకులు ఇంటికి వెళ్లిపోయారు. అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు షాపు పక్కన ఉన్న షట్టర్‌ను విరగొట్టి లోపలికి వెళ్లారు. అందులో ఉన్న మద్యాన్ని తీసుకెళ్లారు. అయితే దొంగలు పోతూపోతూ షాపు వద్ద ఉన్న అన్ని సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. అదేవిధంగా సీసీ ఫుటేజీ నిక్షిప్తమయ్యే డీవీఆర్ బాక్సును సైతం ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం షాపు తెరవడానికి వచ్చిన నిర్వాహకులు షాపులో దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్‌ఐ షాపు వద్దకు వెళ్లి విచారణ చేశారు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన క్లూస్‌టీం బృందం ఆధారాలను సేకరించింది. వైన్‌షాపులో సుమారు రూ.5.20లక్షల మద్యాన్ని దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఎస్‌ఐ తెలిపారు. జితేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రే వైన్‌షాపునకు మద్యం రాగా అర్ధరాత్రి దొంగతనం కావడం, అది కూడా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఉండడంతో చర్చనీయాశంగా మారింది.

కాంగ్రెస్ ముక్త్ భారత్ కోసం బీజేపీ అడుగులు

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మురళీధర్ రావు


సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్ రావు

కందనూలు: అరవై ఏళ్ల పాలనలో దేశంలో ఉగ్రవాదులను, ఏర్పాటు వాదులను పెంచి పోషించి, అంతర్గత కుమ్ములాటకు కారణమైన కాంగ్రెస్ పార్టీ ముక్త్ భారత్ కోసం కేంద్రంలోని బీజేపీ అడుగులు వేస్తుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జ్ మురళీధర్ రావు అన్నారు. పార్లమెంటు మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన, పార్టీ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు ఏళ్లేని సుధాకర్ రావు అధ్యక్షతన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు నియోజకవర్గాల్లో 6, 7, 8 తేదీల్లో (మూడు రోజుల పాటు) ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీల సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశాల్లో సంస్థాగతంగా పార్టీని ఎలా బలోపేతం చేయాలి, పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చిస్తామని చెప్పారు. కేంద్రంలో నరేంద్ర మోదీ నేతృత్వంలో రెండుసార్లు గెలిచిన బీజేపీ, దేశం కోసం ఏం చేసింది, మరోసారి అధికారంలోకి వస్తే ఏం చేయబోతుంది వివరించేలా పకడ్బందీ వ్యూహాలతో ముందుకు సాగుతామన్నారు. ఆర్టికల్ 370 రద్దు, రామమందిరం నిర్మాణం, ముస్లిం మహిళలకు రక్షణ కల్పించే ట్రిబుల్ తలాక్ రద్దు వంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని చరిత్ర సృష్టించామని చెప్పారు. రాష్ట్రంలో గణనీయమైన ఓటు బ్యాంకు సంపాదించుకొని 10 సీట్లు సాధిస్తామన్నారు. దేశంలో వేగంగా అంతరించిపోతున్న పార్టీల్లో కాంగ్రెస్ పార్టీ ఒకటి అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగా హైవేలు, రైల్వే ప్రాజెక్టులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, గిరిజన విశ్వవిద్యాలయం వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఇచ్చిందని గుర్తు చేశారు. అవినీతిలో కేసీఆర్‌ను అరెస్టు చేస్తామని పదేపదే చెబుతున్న కాంగ్రెస్ నాయకులు, దర్యాప్తు సంస్థలకు ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మోదీని గెలిపించడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ఆచారి, దిలీప్ చారి, కట్టా సుధాకర్, కృష్ణ గౌడ్, అయోధ్యా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ దందాలపై చర్యలు తప్పవు

- 4 టిప్పర్లు, 9 ట్రాక్టర్లు పట్టివేత

గద్వాల క్రైం: అనుమతి లేకుండా మట్టి, ఇసుక, రేషన్‌బియ్యం తరలిస్తున్న వ్యక్తులపై చర్యలు తప్పవని ఎస్పీ రితిరాజ్ హెచ్చరించారు. మంగళవారం తెల్లవారుజామున జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న 4 టిప్పర్లు, 9 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని యాజమానులపై గద్వాలరూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశామన్నారు. అక్రమ దందాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దుల వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిషేధిత మద్యం, మత్తు కలిగించే పాన్ మాసాల, జర్ద, గుట్కా తదితర వాటిని కట్టడి చేస్తున్నామన్నారు. జిల్లాలో అనుమతి లేకుండా ఇసుక, మట్టి, రేషన్ బియ్యం, మద్యం తదితర చీకటి దందాలు నిర్వహిస్తున్న ముఠా సభ్యుల వివరాల ఆధారంగా ఆరా తీస్తున్నామన్నారు. ఎలాంటి రాజకీయ ఒత్తిడీలకు తలొగ్గేది లేదన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం కనబరిచిన శాఖ పరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మహమ్మదాబాద్: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. గండేడ్ మండలంలోని రంగారెడ్డిపల్లికి చెందిన మల్లేష్, కప్లాపూర్ చెందిన తిరుపతిరెడ్డి కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ఇదే క్రమంలో మంగళవారం కూడా రంగారెడ్డిపల్లి వాగు నుంచి ఉదయం 7గంటల ప్రాంతంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. రెండు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్లు, యజమానులపై కేసు నమోదు చేసినట్లు మహమ్మదాబాద్ పోలీసులు తెలిపారు.